క్లుప్తంగా

భీమేశ్వరుని దర్శించుకున్న హైకోర్టు జడ్జి



భీమేశ్వరాలయంలో వేదాశీర్వచనం అందుకుంటున్న హైకోర్టు జడ్జి మల్లికార్జునరావు దంపతులు

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు సోమవారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం బేడా మండపంలో వేద పండితుల వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని వారికి స్వామివారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

వరి సాగులో చివరి దశ కీలకమే

కాజులూరు: వరి సాగులో నారుపోసిన దశ నుంచి పంట మాసూలు చేసి గింజలు ఒడ్డుకి చేర్చేవరకూ అన్ని దశలు కీలకమైనవేనని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని చేదువాడ, తిప్పరాజుపాలెం, కాజులూరు తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారి పంట పొలాలను పరిశీలించి క్షేత్రస్థాయిలో రైతులకు పలు సూచనలు అందించారు. ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో వరి పంట గింజ గట్టిపడే దశ నుంచి మాసూళ్ల దశకు చేరువలో ఉందన్నారు. 15 నుంచి 20 రోజుల్లో కోతకోసే పరిస్థితి ఉండటంతో కొందరు రైతులు పంటలను అంతగా పట్టించుకోరని అయితే ఈ దశలోనూ పంటపై తెగుళ్ల సోకితే గింజ తేలికగా మారి దిగుబడి తగ్గిపోతుందన్నారు. ఈ చివరి దశలోనూ రైతులు పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తెగుళ్లను గమనించాలని అవసరమైతే వ్యవసాయాధికారులను సంప్రదించి మందులు వాడాలన్నారు.

దోసారావు సేవలు చిరస్మరణీయం



దోసారావు జయంతిలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రాయవరం: సోమేశ్వరం గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన దివంగత నిమ్మకాయల దోసారావు గ్రామాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. సర్పంచ్ ఆరిఫ్ అధ్యక్షతన సోమవారం మాజీ సర్పంచ్ దోసారావు 62వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్‌లు ఆరిఫ్, శాకా ఆదినారాయణ, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, మాజీ ఎంపీటీసీలు కోట వెంకట్రావు, గరగ కామరాజు తదితరులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో దోసారావు తనదైన ముద్రను వేసుకున్నారన్నారు. దోసారావును స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, వైట్ల రాంబాబు, వినకోట ప్రకాష్, నాగదేవర అప్పారావు, బైరిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలు

రాయవరం: మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో సోమవారం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రాజీవ్ గాంధీ పంచాయతీ సంస్కృతీకరణ అభియాన్‌లో భాగంగా మొదటి చట్టబద్ధమైన గ్రామ సభలు ఆయా గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. రాయవరంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ఎంపీపీ నౌడు వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అన్ని శాఖల సమన్వయంతో గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించే 29 అంశాలను సమన్వయం చేసుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి అందరి సహకారం అవసరమన్నారు. సమావేశంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు, ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని వెదురుపాక, వి.సావరం, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి తదితర పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో పీవీఆర్ హైస్కూల్ ఎదురుగా సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఉండూరుకు చెందిన వరసాల కిరణ్‌బాబు ద్రాక్షారామ నుంచి రామచంద్రపురం వెళుతున్నాడు. అదే సమయంలో కె.గంగవరానికి చెందిన పెద్దింశెట్టి కేశవకుమార్ రామచంద్రపురం నుంచి తన గ్రామానికి వెళుతున్నాడు. ఇద్దరి మోటారు సైకిళ్లు హైస్కూల్ ఎదురుగా వచ్చే సమయానికి ఎదురెదురుగా ఢీకొట్టడంతో కేశవకుమార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. కిరణ్‌బాబుకు చేతి వేళ్లు తెగిపడ్డాయి. వీరిని ముందుగా రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

అందరివాడు అంబేడ్కర్

- ఎంపీ బోస్, కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్
- సమసమాజ స్థాపనకు కృషి
- ఘనంగా అంబేడ్కర్ జయంతి



పట్టణంలోని ప్రధాన రహదారిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్, చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

రామచంద్రపురం: దేశంలో సమసమాజ స్థాపనకు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారని, ప్రపంచ మేధావిగా దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేసిన మహానుభావుడని రాజ్యసభ ఎంపీ, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్రబోస్ కొనియాడారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీ బోస్, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ బోస్ అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారిలో గల అంబేడ్కర్ విగ్రహానికి సూర్యప్రకాశ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ప్రశంసించేలా మన రాజ్యాంగాన్ని రచించి దేశంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని ఆయన కొనియాడారు. అనంతరం 19వ వార్డు కమ్మువారి సావరం తదితర పారతాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పలువురు కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

సమాజ నిర్దేశకుడు

సమ సమాజ నిర్మాణ కృషీవలుడు అంబేడ్కర్ అని రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు వరాహ నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడు గోవర్ధన మల్లేశ్వరరావు, స్పోర్ట్స్ అండ్ కల్చర్ కార్యదర్శి సాదే నారాయణ రావు, కోశాధికారి చింతపల్లి శ్రీనివాసరావు, మహిళా ప్రతినిధి లకాని పద్మకమలకుమారి, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. దేశ పాలనకు రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ నవసమాజ నిర్మాతగా చరిత్రకెక్కారని హెడ్ పోస్టు మాస్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి కొనియాడారు. పట్టణంలోని ప్రధాన తపాల కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మహనీయుడు అంబేడ్కర్: మంత్రి సుభాష్

కులతత్వం, అంటరానితనాన్ని పారద్రోలి సమానత్వం కోసం చివరి శ్వాస వరకు పోరాడిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి నేతలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: రాజ్యాంగ పితామహుడు అంబేడ్కర్ జయంతి వేడుకను మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాస్ మండల కేంద్రమైన కె.గంగవరం, సత్యవాడ, అముజూరు గ్రామాల్లో పర్యటించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కె.గంగవరం బస్టాండ్ సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ పంపన నాగమణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివల గ్రామంలో సర్పంచ్ అనుసూరి సాయి ఆధ్వర్యంలో, కుందూరులో వైఎస్సార్ సీపీ నాయకుడు బత్తుల అప్పారావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. దంగేరులో జరిగిన జయంతి వేడుకల్లో ఎంపీటీసీ లక్ష్మణ్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

కాజులూరులో..

కాజులూరు: నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో నూరుశాతం అమలుచేశారని వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ పోలినాటి సూర్యచంద్రం అన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు జగనన్న పాలన ఎంతగానో దోహద పడిందని ఆయన అన్నారు. అంబేడ్కర్ జయంతిని కాజులూరు మండల గ్రామాల్లో ప్రజలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ ఆవరణలో ఎంపీపీ మాత భారతి ఆధ్వర్యంలోనూ, గొల్లపాలెం, శలపాక, ఒంటితాడి, మంజేరు, శీల, దుగ్గుదుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పోతురాజు ప్రసన్నమానిక, పోతుల గనిరాజు, నెల్లి బ్రహ్మాజీ, గుంటూరి అప్పారావు, కోమలి వెంకటరమణ, పోతుల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలోనూ, దగ్గుదుర్రులో బీజేపీ రామచంద్రపురం నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ ఆధ్వర్యంలోనూ, కుయ్యేరులో పార్టీ వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మేకల శ్రీనివాసు, మాజీ సర్పంచ్ పోతుల మాధవ ఆధ్వర్యంలోనూ, బందనపూడిలో మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి మొకన శ్రీనివాస్ ఆధ్వర్యంలోనూ నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పుట్టి నరోజు కేక్ కట్ చేసి స్థానికులకు పంచారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, మాత మురళి, పోతురాజు బాబూరావు, జనసేన నాయకుడు డేగల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలంలోని పల్లెల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని నీలి రంగు జెండాలు రెపరెపలాడాయి. యువకులు మోటారు సైకిళ్లకు నీలి రంగు జెండాలు కట్టి ర్యాలీలు చేశారు. ఎంపీ బోస్ తన స్వగ్రామం హసన్‌బాదలో అంబేడ్కర్‌కు ఘనంగా నివాళి అర్పించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ మండలంలోని పలు చోట్ల అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ద్రాక్షారామలో యానం సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో సూర్యప్రకాశ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విగ్రహం వద్ద కేక్ కట్ చేసి అంబేడ్కర్ అభిమానులకు తినిపించారు. జగన్నాయకులపాలెంలో సిద్ధార్ధ యూత్, చైతన్య యూత్ సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాకా బాబీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంత సంతోషం, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, దళిత సంఘాల నాయకులు దడాల రవికుమార్, దడాల వెంకటరమణ, గుబ్బల శ్రీనివాస్, సాదే రాజేష్, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు. మండలంలోని గ్రామగ్రామాన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కుల సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

అంబేడ్కర్ బాట సదా అనుసరణీయం

రాయవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చూపిన బాట ప్రతి ఒక్కరికీ సదా అనుసరణీయమని ఎంపీపీ నౌడు వెంకటరమణ పేర్కొన్నారు. ఎంపీపీ కార్యాలయం వద్ద సోమవారం అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

దార్శనికుడు అంబేడ్కర్

కపిలేశ్వరపురం: పేదల ఆశాజ్యోతి, దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. వాడవాడల ఆయన విగ్రహాల వద్ద నివాళులు అర్పించారు. పలు కార్యక్రమాల్లో వక్తలు ఆయన సేవలను కొనియాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, దళితవాడలలో ప్రజాసంఘాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాతపూడి, కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అచ్యుతాపురం, నల్లూరు, కాలేరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగలచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పడమర ఖండ్రికలో «అంబేడ్కర్ జీవితం–రాజ్యాంగ రచన» అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీలు పలివెల మధు, గొల్లపల్లి సోనియా, ఉప్పుదిశెట్టి వీరవేణి, నాయకులు మేడిశెట్టి దుర్గారావు, ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. 19 గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, దళిత, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

బడుగుల జీవితాల్లో వెలుగు నింపిన మహోన్నతుడు అంబేడ్కర్

మండపేట: బడుగు బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగు నింపిన మహోన్నతమైన వ్యక్తి భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు కొనియాడారు. కేశవరంలో జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహించారు. పార్టీల కతీతంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా మాజీ సర్పంచ్ దూలం ఆనందరావు, వెంకన్నబాబు, కర్రి తాతారావు తదితరులు హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. తాపేశ్వరంలో ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బూర చిన్న నాయకత్వంలో జరిగిన వేడుకల్లో వ్యవస్థాపక అధ్యక్షుడు ఉండ్రాజవరపు అర్జున్ ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్‌కు పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తుపాకుల ప్రసన్నకుమార్, కూసి దొరజీ, ముక్కపాటి శ్రీనివాస్, యడ్ల రవి, అద్దంకి రమణ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నతుడు అంబేడ్కర్

మండపేట: అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్‌సీపీ నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రెడ్డి రాధాకృష్ణ, యువనేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీరాజ్ ఉద్ఘాటించారు. మండలంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. తాపేశ్వరం, మారేడుబాక పలు గ్రామాలతో అంబేడ్కర్ విగ్రహాలకు వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులు అర్పించి సేవలను మననం చేసుకున్నారు. వాణీమహల్ జంక్షన్ వద్ద వున్న విగ్రహాలకు, 7, 8, 10, 11 వార్డుల పరిధిలోని ఎస్సీ కాలనీల్లో వున్న విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పార్టీల వారిగా విడివిడిగా జరిగిన కార్యక్రమాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, పృథ్వీరాజ్, పట్టాభి, రాజబాబులు ముఖ్య అతిథిలుగా పాల్గొనగా, టీడీపీ నాయకుల అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌లు ముఖ్య అతిథిలుగా హాజరై మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. ఏడిద, తాపేశ్వరంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు.



కపిలేశ్వరపురంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు



కేశవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు



మండపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కె.గంగవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు



కాజులూరులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ భారతి తదితరులు



జగన్నాయకులపాలెంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ భవాని, నాయకులు



రాయవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటరమణ తదితరులు



మండపేట మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, సభ్యులు

ద్వారపూడిలో రామాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



స్వామివారిని దర్శించుకుంటున్న పృథ్వీరాజ్, గ్రామస్తులు

మండపేట: సువర్చలా సమేత రామాంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠోత్సవం ద్వారపూడిలో సోమవారం ఘనంగా జరిగింది. వేద పండితుడు సత్యవాడ వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆలయ వ్యవస్థాపకుడు ఎస్ఎల్ కనకరాజు చేతుల మీదుగా జరిగిన కార్యక్రమంలో యువనేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీరాజ్ హాజరైస్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా పృథ్వీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో విశేష పూజా కార్యక్రమాలు, హోమాధియాగాలు నిర్వహించి స్వామివారిని ప్రతిష్ఠింపజేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పోతుల రాంబాబు, మాజీ ఎంపీపీ అడబాల బాబ్జి, వైసీపీ నాయకులు పాంద్రంకి మహేష్, సత్తింశెట్టి శివ, శంకర్, ఆలీషా తదితరులు పాల్గొన్నారు.

జగ్గిరెడ్డికి వైఎస్సార్ సీపీ నేతల అభినందన



జగ్గిరెడ్డికి స్వామి వారి జ్ఞాపికను బహూకరిస్తున్న పాపారాయుడు



నూతన అధ్యక్షుణ్ణి సత్కరిస్తున్న రాజబాబు

మండపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు)లు అభినందనలు తెలిపారు. జగ్గిరెడ్డి నూతన నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ వారంతా సోమవారం గోపాలపురంలోని ఆయన నివాసం కలిశారు. సందర్భంగా జగ్గిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాలు, పూల మాలల, పుష్ప గుచ్ఛాలతో ముంచెత్తారు. వేంకటేశ్వరస్వామి వారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించి అభినందనలు తెలిపారు. జగ్గిరెడ్డి నాయకత్వంలో జిల్లాలో పార్టీ మరింత బలపడుతుందని ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఆ పార్టీ డాక్టర్స్ వింగ్ జిల్లా కన్వీనర్ చోడే సత్యకృష్ణ, నాయకులు పెంకే గంగాధర్, దాసరి సత్యనారాయణ, ముక్కా దాలయ్య, జెడ్పీటీసీ సభ్యురాలి భర్త, సీనియర్ నాయకుడు కుడిపూడి రాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పలివెల సుధాకర్ ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ టీవీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై సురేష్‌బాబు

రాయవరం: ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని లొల్లలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాలను ఎస్సై సురేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై సురేష్‌బాబు మాట్లాడుతూ సీసీ టీవీ, కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో నేరాలు జరిగినప్పుడు వెంటనే నేరస్థులను గుర్తించడం, వాటిని అరికట్టడానికి వీలవుతుందన్నారు. ముఖ్యంగా ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలు కంటిపూడి సర్వారాయుడు, చెరుకూరి వీరవెంకటసత్యనారాయణ, గారపాటి తమ్మయ్య, అల్లూరి శ్రీనివాస చౌదరిలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాతూరి రాంబాబు, సుంకవిల్లి గంగరాజు, పాతూరి అప్పారావు, గుండపునీడి వీర్రాజు, పంచాయతీ కార్యదర్శి అత్తిలి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



పడిపోయిన స్తంభాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల



విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

నేల కూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

మండపేట: పట్టణంలో ఆదివారం రాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. దానికి తోడు భారీ వర్షం కురిసి జనజీవనాన్ని స్తంభించింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఉదయం నుంచి నడినెత్తిన ఎండ ఉండడంతో జనం ఉక్కపోతకు గురయ్యారు. రాత్రి అనూహ్యంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఈదురు గాలులతో గంట సేపు భారీ వర్షం కురిసింది. తుపాను ధాటికి మండలంలోని తాపేశ్వరంలో చెట్టు కూలి పోగా, పట్టణంలోని గొల్లపుంత వీధిలో కొబ్బరి చెట్టు విరిగిపోయి విద్యుత్ తీగలపై నుంచి కింద పడింది. మెరుపు వేగంతో కొబ్బరి చెట్టు బలంగా తీగలపై పడడంతో రెండు స్తంభాలు విరిగి రోడ్డుపై పడ్డాయి. అదే సమయంలో జనం సంచరించక పోవడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపరి పీల్చుకున్నారు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గొల్లపుంత వచ్చి పరిశీలించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్‌తో కలిసి సంఘటన తీరును తెలుసుకున్నారు.

ఆ వార్డు కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్ వివరించారు. దీంతో ఆయన విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్ చేసి వెంటనే స్తంభాలు వేసి సరఫరా అందివ్వాలని ఆదేశించారు. అధికారులు చర్యలు చేపట్టి వాటి స్థానంలో కొత్త స్తంభాలను నిర్మించారు. వాదా ప్రసాదరావు, మచ్చా నాగబాబు, కట్టుమేను వీర్రాజు, గుణ్ణ శ్రీను తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతులు



హసన్‌బాదలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ బోస్

రామచంద్రపురం రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో హసన్‌బాదలో నిర్వహించిన వక్తృత్వ, చిత్ర లేఖన పోటీల్లో విజేతలకు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అంబేడ్కర్ జీవిత విశేషాలపై వక్తృత్వ పోటీల్లో మొదటి బహుమతి ద్రాక్షారామకు చెందిన తలాటం శ్రీసూర్య భవిత, ద్వితీయ బహుమతి తోటపేటకు చెందిన అభిజ్ఞ, తృతీయ బహుమతి హసన్‌బాదకు చెందిన దవులూరి యజ్ఞ దుర్గ వీర రాఘవ, ప్రోత్సాహక బహుమతులు చాగంటి వీనయ్, ఇంటి కార్తిక్ గెలుపొందారు. అదే విధంగా చిత్రలేఖన పోటీల్లో హసన్‌బాద గురుకుల పాఠశాలకు చెందిన రాయుడు నిస్వార్ట్ మొదటి బహుమతి, మజ్జి విజయ్ ద్వితీయ బహుమతి, అభిజ్ఞ తృతీయ బహుమతి గెలుపొందారు. కార్యక్రమంలో గోదావరి కవిర్యాలి శ్రీనివాస్, రచయితలు ఆర్వీపీ రాజా, గరగ రామకృష్ణ, చల్లా శ్రీనివాస్, ఉప సర్పంచ్ నీలం భవాని, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. స్వామికి విశేష పూజలు జరిపారు. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామికి అత్యంత వైభవంగా పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త గణేశుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామిని హనుమంతుని వాహనంపై ఊరేగించారు. తిరుప్పావడ, వసంతోత్సవం, పూలంగి సేవ, ఊంజల్ సేవ, ఏకాంత సేవ వంటి విశేష సేవలు జరిపారు. స్వామికి విశేష కైంకర్యం చేశారు. కోలాటం ఏర్పాటు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.